సాక్షి బాపట్ల

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023

I



ఆరోగ్య సురక్ష బుక్‌లెట్స్ పంపిణీ

గుంటూరు మెడికల్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టోకెన్ బుక్ లెట్స్‌ను డీఎంహెచ్‌ఓ శ్రావణ్‌బాబు తన కార్యాలయంలో పంపిణీ చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 2618 క్యూసెక్కులు విడుదల చేశారు.



మట్టి ప్రతిమల పంపిణీ

గుంటూరు లీగల్: మట్టి గణపతి ప్రతిమల పంపిణీ ప్రశంసనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి చెప్పారు. కోర్టు ప్రాంగణంలోప్రతిమలను పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

జేసీఎస్ కో-ఆర్డినేటర్ల నియామకం

బాపట్ల: వైఎస్సార్‌సీపీ జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్లు నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నిర్ణయం తీసుకుంది. జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్లుగా మారెడ్డి సరేంద్ర, సిరిపురం చెంచు రామిరెడ్డిని నియమించింది.


20న మినీ జాబ్ మేళా

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం గ్రామంలోని ఎస్‌కేబీఎం ఐటీఐ కళాశాలలో ఈనెల 20న ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ జాబ్ మేళాకు ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయని పదో తరగతి, ఇంటర్మీడియెట్ , డిగ్రీ, డిప్లమో, బీటెక్ చదివి 28 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు తగిన ధ్రువీకరణ పత్రాలతో మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు 99888 53335, 79814 44377 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన నిరుద్యోగులు జాబ్ మేళాను వినియోగించుకోవాలని సూచించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి జైలు

చీరాల: బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడి చేసిన ఘటనలో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ తీర్పును వెలువరించారు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. చీరాలలోని ఉజిలిపేటలో నివాసముంటూ పదోతరగతి చదువుతున్న బాలికను గత ఏడాది నవంబర్ 22న పేరాల మేరి క్రిస్టియన్‌పేటకు చెందిన గొర్రెముచ్చు చంద్రబాబు అలియాస్ కోటేశ్వరరావు బాలిక చదువుకుంటున్న పాఠశాలకు వెళ్లి వారి తల్లిదండ్రులు గొడవపడుతున్నారని అబద్ధం చెప్పాడు. ఆమెను చీరాలలోని ఎన్టీఆర్ నగర్‌లోని ఓ ఇంటికి తీసుకెళ్లి చంపేస్తానని బెదిరించి ఆమెపై లైంగిక దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక తల్లికి విషయాన్ని చెప్పడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టూటౌన్ సీఐ సోమశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని నెలరోజుల్లో దర్యాప్తు చేసి తగిన ఆధారాలతో కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఒంగోలు పోక్సో కోర్టులో విచారణ ప్రారంభమైన నాటి నుంచి డీఎస్పీ పి.ప్రసాదరావు సూచనలతో సీఐ సోమశేఖర్, మహిళా ఎస్సై చంద్రావతి, కోర్టు మానిటరింగ్ సిబ్బంది శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు సాక్షులను కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. పీపీ వై.వెంకటేశ్వరరావు నిందితుడిపై నేరాన్ని సాక్ష్యాధారాలతో రుజువు చేయడంతో న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855.60 అడుగుల వద్ద ఉంది.

శ్రమైక జీవనయానం

బతుకు'బండి'

- రద్దీ రైళ్లలో పూలు, ఆకుకూరలు, పండ్లు అమ్ముతూ కుటుంబ పోషణ
- నిత్యం చీరాల నుంచి హైదరాబాద్ వరకు ప్రయాణం
- రెండు గ్రామాల్లో 200 మంది మహిళల నిత్య పోరాటం



చీరాల రైల్వేస్టేషన్‌లో హైదరాబాద్ వెళ్లేందుకు పూలు,కూరగాయలతో ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న మహిళలు

చీరాల: అన్నీ రద్దీ రైళ్లు. అడుగు తీసి అడుగు వేయాలంటే నరకయాతనే. పోలీసుల చివాట్లు.. టీసీల బెదిరింపులు, ప్రయాణికులు ఛీత్కారాల మధ్య కొన్ని దశాబ్దాలుగా రైలు బండినే తమ బతుకు బండిగా మార్చుకుని జీవనపోరాటం చేస్తున్నారు ఆ మహిళలు. శ్రమైక జీవన యానంలో చిందిన చెమట చుక్కల్లోనే ఆనందబాష్పాలు వెతుక్కుంటున్నారు. కుటుంబ పోషణకు నాలుగు రాళ్లు సంపాదించుకుంటున్నారు.

సేద్యంలో నష్టాలతో..

బాపట్ల జిల్లాలోని చీరాల రూరల్ మండలంలోని గవినివారిపాలెం, బోయినవారిపాలెం అంటే ఓ ప్రత్యేకత ఉంది. అక్కడి ప్రజలు ఒకప్పుడు వ్యవసాయం, పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగించారు. అయితే తరచూ వ్యవసాయంలో నష్టాలు చవిచూడటంతో వారి జీవన గమ్యాన్ని మార్చుకున్నారు. రైళ్లలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇంటి యాజమాని గ్రామంలోనే సేద్యంతోపాటు కూలి పనులు, పాడిపరిశ్రమ చేస్తూ ఉంటే మహిళలు మాత్రం ఉదయాన్నే ఏడు గంటలకల్లా చీరాల రైల్వేస్టేషన్‌కు తరలివస్తారు. సీజన్‌ను బట్టి ప్రధానంగా ఉడకబెట్టిన వేరుశనగలు (పల్లీలు), ఉడకబెట్టిన నల్ల శనగలు, మొక్కజొన్నలు, మొలకలు, సీజన్‌ను బట్టి వివిధ రకాలైన పండ్లు, పూలు, పూలమొక్కలు, తినుబండారాలు తీసుకొచ్చి రైళ్లలో తక్కువ ధరకు అమ్ముతుంటారు. నిత్యం 200 మంది మహిళలు ఇలా బతుకుబండి లాగిస్తున్నారు. కొందరు చీరాల నుంచి విజయవాడ వరకు, మరికొందరు చీరాల నుంచి గూడూరు వరకు హద్దులు పెట్టుకుని ఈ అమ్మకాలను సాగిస్తున్నారు. రోజుకు రూ.700 నుంచి రూ.1,000 వరకు సంపాదిస్తామని చెబుతున్నారు. సగటున రోజుకు ఒక్కో మహిళ 500 కిలోమీటర్లు ప్రయాణిస్తుంటారని పేర్కొంటున్నారు. కొందరైతే హైదరాబాద్ వరకు వెళ్తుంటారని సమాచారం. నిత్యం చీరాల నుంచి హైదరాబాద్‌కు పది రైళ్లు తిరుగుతుంటాయి.

ఇసుక భూముల్లో పండిన ఉత్పత్తులే విక్రయం

బోయినవారిపాలెం, గవినివారిపాలెం గ్రామ పంచాయతీల్లో ఇసుక భూములు ఎక్కువ. ఈ గ్రామాల్లో ప్రధానంగా ఆకుకూరలు, కూరగాయలు, పూలతోటల పెంపకం చేస్తుంటారు. వీటిసాగులోనూ మహిళలే అధిక బాధ్యతలు నిర్వహించటం విశేషం. తమకున్న కొద్దిపాటి ఇసుక నేలలో ఆకుకూరలు, పూలమొక్కలు, పూలదండలలో ఉపయోగించే లైనాకు సాగుచేసి వాటిని స్వయంగా తీసుకెళ్లి రైళ్లలో అమ్ముతుంటారు.



ప్లాట్‌ఫామ్‌పై మూటలు కట్టిన ఆకుకూరలు



పూలు కట్టుకుంటూ స్టేషన్‌లో రైలు కోసం వేచి ఉన్న మహిళ

ఉద్యోగుల పనితీరు మెరుగుకే ప్రత్యేక గ్రీవెన్స్



గ్రీవెన్స్‌సెల్‌లో ఉద్యోగుల సమస్యలు వింటున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ చేపట్టామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎటువంటి సమస్యలూ లేకుంటే ఉద్యోగులందరూ ఆహ్లాదకర వాతావరణంలో సమర్థంగా పనిచేస్తారని, వారి పనితీరు మెరుగుకే ప్రతినెలా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని వివరించారు. అధికారులు కింద స్థాయి ఉద్యోగులను ఇబ్బంది పెట్టరాదని సూచించారు. అనంతరం పలువురు ఉద్యోగులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. వాటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కారమార్గం చూపారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ సంఘ ప్రతినిధులు కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీ సి.హెచ్.శ్రీధర్, ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.పూర్ణచంద్రరావు, జిల్లా కార్యదర్శి తులసి శ్రీనివాసరావు, జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షులు విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి కేసీ రాజు, కోశాధికారి డి.ప్రవీణ్, పూర్ణ చంద్రరావు, రూతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సేద్య విద్యకు అధ్యయనం



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సుధాకర్

బాపట్ల: ఆన్‌లైన్‌లో సేద్య విద్యకు అధ్యయనం జరుగుతోందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ అగ్రికల్చర్, నోడల్ అధికారి డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. వ్యవసాయ కళాశాలలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, ఇండియన్ అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన 'జాతీయ వ్యవసాయ విద్యా వ్యవస్థ - మిశ్రమ జ్ఞానార్జన వేదిక' అనే అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ నూతన విద్యా విధానం -2020ను అనుసరించి కళాశాలల్లో విద్యా బోధనా విధానాల్లో పలు మార్పులు జరగనున్నాయని, ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకూ ప్రణాళికలు రూపొందనున్నట్టు వివరించారు. ఈ నేపథ్యంలోనే బాపట్ల వ్యవసాయ కళాశాలలో బ్లెండెడ్ లెర్నింగ్ విద్యా బోధనకు తీసుకోవాల్సిన చర్యలపై వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. న్యూ ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ఎన్‌ఏహెచ్‌ఈపీ, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ సుదీప్ మార్వా ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించారు. అష్రఫుల్ హక్, సప్నా నిగమ్, కనిష్క అగర్వాల్, వికాస్ పూనియా తదితరులు స్థానిక బోధన సిబ్బందికి ప్రత్యక్ష శిక్షణనిచ్చారన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన 50 మంది బోధనా సిబ్బంది, 80 మంది బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ వి. శ్రీనివాసరావు అధ్యక్షతన వర్క్‌షాప్ జరిగింది.

దిగ్విజయంగా జగనన్నకు చెబుదాం



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

పల్నాడు కలెక్టర్ శివశంకర్ లోతేటి

రొంపిచర్ల : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో దిగ్విజయంగా అమలు చేస్తున్నట్టు పల్నాడు కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన మట్లాడారు. జిల్లాలో 28 మండలాల్లోనూ జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో రెవెన్యూ సమస్యలు పొందుపరచాలని సూచించారు. అనుమతుల్లేని లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ జి.అంకారావు, ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

11,469 మందికి వైఎస్సార్ కాపునేస్తం

బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో వైఎస్సార్ కాపునేస్తం ద్వారా 1,1469 మంది మహిళలకు 17.20 కోట్ల నగదు అందజేస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం డీబీటీ ద్వారా మహిళల ఖాతాల్లో నగదు జమచేస్తారని పేర్కొన్నారు. ఇప్పటికి నాలుగు విడతలగా కాపు నేస్తాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. బాపట్ల జిల్లాలో 2022-23 ఏడాదికి గానూ 11081 మందికి రూ. 16.62 కోట్లు అందజేయగా, ఈ ఏడాది 11469 మంది మహిళలకు 17.20 కోట్లు ప్రయోజనం కలగనుందని వివరించారు.



యార్డులో 20,485 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 18,113 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 20,485 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు లభించింది.

అభూత కల్పన

అమరావతిలో మరో భూ కుంభకోణం

- కృష్ణానదిలో కలిసిన లంక అసైన్డ్ భూమికి పట్టా జరీబు ప్యాకేజ్
- రెవెన్యూ పాత రికార్డుల్లో మాత్రం లంక అసైన్డ్ భూమిగానే..
- ల్యాండ్ పూలింగ్‌కి ఇచ్చి పరిహారంగా ప్లాట్లు పొందిన టీడీపీ నేత
- రావాల్సిన దాని కన్నా 7,095 గజాలు అధికంగా హాంఫట్



కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన అమరావతి జేఏసీ నేత బెజవాడ రమేష్ (సర్కిల్లోని వ్యక్తి)


సాక్షి ప్రతినిధి, గుంటూరు : అమరావతిలో మరో భూబాగోతం బట్టబయలైంది. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, ఆయన పచ్చ గ్యాంగ్ ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. రాజధాని ముసుగులో భూ కుంభకోణాలకు తెరతీశారు. అన్ని పత్రాలూ సక్రమంగా ఉన్న రైతులు వివిధ సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరిగి సతమతమైతే టీడీపీ నేతలు మాత్రం కృష్ణానదిలో ఉన్న లంక అసైన్డ్ భూములనూ పట్టా జరీబుగా మార్చేసి లబ్ధి పొందారు. అప్పటి తహసీల్దార్(రిటైర్డ్) సుధీర్ బాబు, మందడంకు చెందిన అమరావతి జేఏసీ కీలక నేత బెజవాడ రమేష్, ఒక రైతు కలిసి కృష్ణానదీ గర్భంలో లంక అసైన్డ్ భూమిని పక్కా పథకం ప్రకారం పట్టా జరీబు భూమిగా మార్చేసి భారీ కుంభకోణానికి తెగబడ్డారు.

సీఆర్‌డీఏతో మూడు దఫాలుగా అగ్రిమెంట్

మందడంకు చెందిన మంగళగిరి గోపాలకృష్ణమూర్తి, లక్ష్మీదేవిలకు 581-3లో 6.2 ఎకరాలు, 581-4లో 1.7 ఎకరాల లంక అసైన్డ్ భూమి ఉంది. మొత్తం మీద 7.9 ఎకరాలను ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చారు. సీఆర్‌డీఏ వీరి భూమిని లంక అసైన్డ్ గుర్తించి 7,110 గజాలు(అసైన్డ్ మెట్ట ప్యాకేజీ) వస్తుందని 2016లో తెలిపింది. కానీ అదే సీఆర్‌డీఏ 2019 మేలో సదరు రైతులకు 11,440 గజాలు వస్తుందని తెలిపింది. సాధారణంగా ఒక రైతుకు సీఆర్‌డీఏతో ఒకసారి మాత్రమే ఒప్పందం జరగాలి. కానీ సదరు రైతులు 2017 ఫిబ్రవరి, 2018 సెప్టెంబర్, 2019 మార్చిలో మూడుసార్లు అగ్రిమెంట్ చేసుకున్నారంటే రికార్డులను తారుమారు చేయడానికి ఎలా యత్నించారో అర్థమవుతోంది.

అధికారాన్ని అడ్డం పెట్టుకుని..

అమరావతి జేఏసీ కీలక నేత బెజవాడ రమేష్ సోదరుడు బెజవాడ నరేంద్ర (మాజీ జెడ్పీటీసీ, మాజీ మంత్రి నారాయణకు అనుచరుడు). అధికారాన్ని అడ్డంపెట్టుకుని రైతులతో ముందుగానే లోపాయికారి ఒప్పందం చేసుకుని లంక అసైన్డ్ భూములను పట్టా జరీబుగా మార్చే ప్లాన్‌కు బీజం వేశారు. అప్పటి తహసీల్దార్ సుధీర్‌బాబుకూ పెద్ద మొత్తంలో ముట్టజెప్పి ఆయన ద్వారా ఆ భూములకు పాసు పుస్తకాలు పుట్టించి 2016లో పట్టా భూములుగా వెబ్ ల్యాండ్‌లో మార్చాడు. అప్పటివరకు లంక అసైన్డ్ భూములుగా గుర్తించిన సీఆర్‌డీఏ తహసీల్దార్ సుధీర్‌బాబు నివేదికతో పట్టా జరీబుగా మార్చేసి 11,440 గజాలు మంజూరు చేశారు. ఈ తతంగంలో మధ్యవర్తిత్వం చేసిన బెజవాడ రమేష్ 3,540 గజాలు రైతు ద్వారా పొందాడు. అవి రమేష్, ఆయన కుటుంబ సభ్యుల పేరు మీదనే ఉన్నాయి. వాటి విలువ ప్రస్తుతం రూ.8.8 కోట్లపైచిలుకే. పాత రెవెన్యూ రికార్డుల్లో 581 నుంచి 602 వరకు లంక అసైన్డ్ భూమి అని స్పష్టంగా ఉంది. 1984-87 మధ్య అప్పటి ప్రభుత్వం కరణాలు, మునసబుల వ్యవస్థను రద్దు చేసి భూమిపై ఉన్న రైతులకు కలెక్టర్, సబ్ కలెక్టర్ల ద్వారా పాసుపుస్తకాలు జారీ చేశారు. 581-3, 581-4 ఉన్న రైతులకు పాసుపుస్తకాలు ఇవ్వలేదు. వీరు ఆక్రమణలో ఉన్నారని ఎన్‌క్రోచ్‌మెంట్ కిందకు వస్తుందని వారికి ఎటువంటి పత్రాలూ ఇవ్వలేదు. రైతు ఆక్రమిత భూమి అయితే ప్యాకేజీ కింద ఎకరాకు 550 గజాలు పరిహారంగా వస్తాయి. కౌలు నగదు రాదు.



581 నుంచి 602 వరకు ఉన్న లంక భూములు అసైన్డ్ అని స్పష్టంగా పేర్కొన్న పాత రికార్డు

466	5C	1.89	పట్టా	మెట్ట
581	1	0.36	ప్రభుత్వ భూమి	
581	2	0.59	లంక అసైన్డ్	మెట్ట
581	3	6.2	లంక అసైన్డ్	మెట్ట
581	4	1.73	లంక అసైన్డ్	మెట్ట
581	5	0.59	లంక అసైన్డ్	మెట్ట
581	6	0.59	లంక అసైన్డ్	మెట్ట
581	7	0.59	లంక అసైన్డ్	మెట్ట
581	8	0.43	లంక అసైన్డ్	మెట్ట
582	1	0.35	ప్రభుత్వ భూమి	మెట్ట

సీఆర్‌డీఏ 2016లో 581-3, 581-4 సర్వే నంబరులో ఉన్న భూమి లంక అసైన్డ్ మెట్ట అని గుర్తించిన వివరాలు



2019, మే13న పట్టా జరీబుగా మార్చి 11,440 గజాలు కేటాయించిన పత్రం

మోసం ఇలా..

భూ సర్వే నంబర్లు :	581-3, 581-4
విస్తీర్ణం:	7.9 ఎకరాలు
పాత రికార్డుల ప్రకారం స్వభావం:	లంక అసైన్డ్
ఎన్‌క్రోచ్‌మెంట్ ద్వారా రైతుకు రావాల్సిన పరిహారం (స్థలం రూపేణా) :	4,345 గజాలు (విలువ సుమారు రూ.10.86 కోట్లు)
సీఆర్‌డీఏ కేటాయించినది :	11,440 గజాలు (విలువ సుమారు రూ.28.60 కోట్లు)
రావాల్సిన దాని కన్నా అదనంగా దోచేసినది :	7,095 గజాలు (విలువ సుమారు రూ.17.73 కోట్లు)
సీఆర్‌డీఏ నుంచి కౌలు రూపంలో దోచేసిన సొమ్ము :	సుమారు రూ.35 లక్షలు

అప్పటికే కృష్ణలో కలిసిన భూమి

మరో విస్తుపోయే విషయమేంటంటే సదరు రైతుల భూమి సీఆర్డీఏ ఒప్పందం నాటికే కృష్ణానదిలో కొట్టుకుపోయిందని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. నదిలో ఉన్న భూమి నిర్ధారణను కలెక్టర్, జేసీ నివేదికలు లేకుండా తహసీల్దార్ ఎలా చేశారనేది అంతుచిక్కని ప్రశ్న. చివరకు మండల సర్వేయర్ రిపోర్టు లేకుండానే తహసీల్దార్ పని కానిచ్చేశారు. ఈ తతంగంపై రైతులు ఎవరైనా ఫిర్యాదు చేసినా.. ఆరా తీసినా వారి వివరాలు.. ఫిర్యాదు చేసిన కాపీలను జేఏసీ నేత బెజవాడ రమేష్‌కు సీఆర్‌డీఏ కార్యాలయంలోని ఓ ఉద్యోగి చేరవేస్తున్నారని పలువురు చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మంజూరు



పేరలిలో స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ రవీందర్

కర్లపాలెం: కర్లపాలెం మండలంలో రద్దయిన సాల్వేషన్ ఆర్మీ ఎయిడెడ్ పాఠశాలల స్థానంలో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుందని ఆర్డీవో జి.రవీందర్ తెలిపారు. డెప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లుతో కలసి ఆర్డీవో పేరలి, పేరలిపాడు, యారంవారిపాలెం, చింతాయపాలెం, కట్టావాద గ్రామాలలో పర్యటించి ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు కావలసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కర్లపాలెం మండలంలో ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వ ప్రాథమిక విద్యనందించేందుకు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్‌విజయశ్రీ, సర్పంచ్‌లు, కాగిత కరుణకుమారి, మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరావు



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న డీన్ డిడి స్మిత్

బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని 56వ ఇంజినీర్స్ డే సంబరాలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఎస్ఆర్వో (సైంటిస్ట్), చంద్రయాన్ - 3 టీం మెంబర్ డాక్టర్ సి.హెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ సి.హెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశోధనారంగంలో రాణించాలంటే ఆత్మ విశ్వాసం మెండుగా ఉండాలని అన్నారు. నేటి యువతరం పరిశోధనా రంగం వైపు పయనించి దేశం గర్వపడేలా సమాజ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని చెప్పారు. కళాశాలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన హెక్సవేర్ టెక్నాలజీస్ హెచ్‌ఆర్ హెడ్ సొగతాసెను మాట్లాడుతూ నేటి సాంకేతిక విద్యార్థులు భావ వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంపొందించుకుని, ఆధునిక కంప్యూటర్ విజ్ఞానంపై మంచి పట్టు సాధిస్తే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్, సభాధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

సాంకేతిక రంగంలో రాణించి దేశ ప్రగతికి తోడ్పడాలని తెలిపారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల అందిస్తున్న ఆధునిక వనరులను వినియోగించుకుని అనుకున్న లక్ష్యాలను సాధించి ముందుకు సాగాలన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ - 1 డి. రామమోహనరావు, జాయింట్ సెక్రటరీ కె.హరిపద్మ ప్రసాద్, కోశాధికారి టి.రామకృష్ణ, టి.సుబ్బారావులు డాక్టర్ సి.హెచ్.శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ కళాశాల నివేదికను సమర్పించారు. కళాశాల డీన్, స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డి.నిరంజన్ బాబు కూడా మాట్లాడారు.

బాపట్ల మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడల్లో ఇంజినీర్లు పయనించాలని బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టరు డిడి స్మిత్ పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్ డేని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేటెడ్ డీన్ డాక్టర్ స్మిత్ మాట్లాడుతూ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన ప్రాముఖ్యమైన డ్యాములు, ప్రాజెక్టుల గురించి అతని వ్యక్తిత్వం గురించి తెలియజేస్తూ అందరూ ఇతని అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి జాన్ వెస్లీ, డాక్టర్ రామిరెడ్డి డాక్టర్ మాధవ, బి హరిబాబు, గోపావతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మీ భూమి–మా హామీ సర్వేతో ఎంతో ఉపయోగం

రీసర్వే ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రత్యేక అధికారి సుబ్బారావు



రేపల్లె రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మీ భూమి–మా హామీ సర్వేతో ప్రజలకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, నకిలీ రిజిస్ట్రేషన్‌లను నివారించవచ్చని రీసర్వే ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి డి.సుబ్బారావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రీసర్వే పనుల పరిశీలన కు శుక్రవారం విచ్చేసి అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మీ ఇంటికి మీ భూమి పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఖచ్చితమైన కొలతలతో గుర్తించటం జరుగుతుందన్నారు. పైలాన్ ప్రాజెక్ట్‌గా రేపల్లెలో ప్రారంభించిన సర్వే 80 శాతంకు పైగా పూర్తయ్యిందన్నారు. త్వరలోనే నూరుశాతం పూర్తిచేసి యజమానులకు హక్కుదారు పత్రాలను అందిస్తామన్నారు. రాష్ట్రంలోని 123 కార్పొరేషన్, మున్సిపాలిటీలలో, చిన్నపాటి పట్టణాలలో మీ సర్వే ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతి చోట ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పంట పొలాలకు పాసు బుక్‌లు ఉన్నమాదిరిగా పట్టణ ప్రాంతాలలో భూములు, ప్లాట్‌లు కలిగిన హక్కుదారులకు నిర్దిష్ట కొలతలు తెలియజేస్తు సర్టిఫికెట్‌లను జారీ చేయటం జరుగుతుందన్నారు. ఈ సర్వే పూర్తయితే ఆ ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేటు భూమి, ఇతర భూముల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయన్నారు. భూ హక్కుదారులకు అందజేసే పత్రాలలో క్యూఆర్ కోడ్‌తో జారీ చేయటం జరుగుతుందన్నారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ఈ నూతన విధానంతో అమలవుతున్న మీ భూమి–మా హామీ సర్వేపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి నిర్దిష్ట కొలతలతో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కె.వి.నాగజ్యోతి



క్రీడల్లో పాల్గొన్న దివ్యాంగ క్రీడాకారులు

బాపట్ల అర్బన్: జిల్లా స్థాయి దివ్యాంగ విద్యార్థుల క్రీడా పోటీలు బాపట్ల కేంద్రంగా స్థానిక పబ్లిక్ స్కూల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా సహిత విద్య సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 25 మండలాల నుంచి వచ్చిన దివ్యాంగ విద్యార్థులు 115 మందితో క్రీడా పోటీలు నిర్వహించారు. వారిలో 24 మందిని 12 ఈవెంట్లో ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈఈ కె.వి.నాగజ్యోతి అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బి. మోజేష్, జీసీడీఓ చారులత. సమన్వయకర్త వి. సత్యసాగర్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు

జిల్లా ఆర్బీకే డీడీఏ విజయనిర్మల



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

ఇంకొల్లు (చినగంజాం): పత్తిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా రైతు భరోసా కేంద్రం డీడీఏ ఎం. విజయనిర్మల అన్నారు. పావులూరు రైతుభరోసా కేంద్రం–2లో శుక్రవారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర పంటలు, రక్షణ పంటలు వేయడం ద్వారా పురుగు మందుల వాడకం తగ్గించవచ్చని తెలిపారు. జిల్లా ఏరువాక కేంద్రం బాపట్ల శాస్త్రవేత్త వీ సురేఖాదేవి మాట్లాడుతూ గులాబి రంగు పురుగు పూత దశ నుంచే వ్యాపిస్తుందన్నారు. పూత దశ నుంచే సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం వలన పురుగు ఉధృతిని అరికట్టవచ్చన్నారు. పూత దశలోనే నొవాల్యూరోన్ లేదా క్లోరిపైరిఫాస్ మందులను వేపనూనెతో కలిపి పిచికారీ చేయడం వలన గుడ్డి పువ్వులు రాకుండా నివారించవచ్చన్నారు. ప్రస్తుతం పత్తిలో పచ్చదోమ ఉధృతి ఎక్కువగా ఉన్న దృష్ట్యా డైఫెన్థియురాన్ పురుగు మందు పిచికారీ చేయాలని తెలిపారు. లింగాకర్షక బుట్టలు, పసుపు, తెలుపు, నీలం రంగు జిగురు అట్టలను ఎకరాకు 8–10 వరకు పెట్టు కోవడం వలన పురుగుల ఉధృతిని కనుగొనవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎంసీ ఓబయ్య, మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్, వీఏఏ వినయ్, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

అవకాశవాద పొత్తులో కొత్తేమీ లేదు

- జైలులో ఉన్న నేరస్తుడితో పవన్ కల్యాణ్ ములాఖత్
- ప్రజలకు మీరు చెప్పే జవాబుదారీ తనం ఇదేనా
- చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తుపై ఆమంచి ఫైర్

మార్టూరు: అవినీతి ఆరోపణలతో జైలులో ఉన్న మాజీ సీఎం చంద్రబాబు నాయుడిని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కలిసి పొత్తుల గురించి ప్రకటించడం ద్వారా ప్రజలకు ఏం సంకేతాలు పంపదల్చుకున్నారని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ విమర్శించారు. శుక్రవారం కోనంకి గ్రామంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో ఏ మాత్రం ప్రాతినిధ్యం లేని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, 40 ఏళ్ల ఇండస్ట్రీ చెప్పుకునే చంద్రబాబుతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించడం ప్రజలకేమీ కొత్తగా అనిపించలేదన్నారు. ఈ అపవిత్ర పొత్తు గురించి సామాన్యుడు సైతం ఊహించిందేనని ఆమంచి అన్నారు. తనకు అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని సమూలంగా మార్చివేస్తాననే పవన్ కళ్యాణ్ పొత్తుల ప్రకటన గురించి తమ పార్టీ కేడర్‌తో మాట మాత్రం ప్రస్తావించక పోవడాన్ని ఆమంచి ఎద్దేవా చేశారు. ఓ కమ్యూనిటీ బలంతో పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్ వారికి ఏ సమాధానం చెబుతారని ప్రశ్నించారు. చంద్రబాబుపై మోపబడిన నేరాలు, అభియోగాలు పవన్ కళ్యాణ్‌కు కనిపించక పోవటం ఆశ్చర్యంగా లేదని, చట్టం తన పని తాను చేసుకు పోతుందే కానీ ఎవరి ప్రోద్బలం లేదన్నారు. పొత్తులతో ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహనరెడ్డి గెలుపును ఆపడం ఎవరి తరం కాదని ఆమంచి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డెయిరీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి చెంగలయ్య, బొబ్బేపల్లి సొసైటీ చైర్మన్ ఉప్పల అనిల్, మార్టూరు మండల ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, కోనంకి సర్పంచ్ జొన్నలగడ్డ రేణుక, పర్చూరు మాజీ ఏఎంసీ చైర్మన్ జువ్వా శివరామప్రసాద్, భుక్యా బాబునాయక్, జీ రవిచంద్, అట్లూరి సుకుందరావు, మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, గడ్డం మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

స్పందించిన అవుట్‌పోస్ట్ సిబ్బంది



మహిళను కాపాడిన పోలీసులు, గజ ఈతగాళ్లు

బాపట్లటౌన్: కుటుంబ కలహాల విషయంలో మనస్థాపం చెందిన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా, సి.బెళగల్ మండలం, కొత్తకోట గ్రామానికి చెందిన కె. పావని కుటుంబం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. కుటుంబ సమస్యలతో మనస్థాపం చెందడంతో ఆత్మహత్య చేసుకునేందుకు సూర్యలంక సముద్రతీరానికి వచ్చిందన్నారు. ఇటీవల ఇంట్లో నుంచి పారిపోయి రావడంతో భార్య కనిపించడం లేదంటూ భర్త సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సదరు మహిళ సూర్యలంక సముద్రతీరంలోకి ఒంటరిగా వెళ్లి సముద్రంలోకి దిగడం గమనించిన అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.పోతురాజు తోటి సిబ్బంది, గజ ఈతగాళ్లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ఆమెను అదుపులోకి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను కాపాడిన పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

లక్ష్య సాధనలో అధికారుల పాత్ర కీలకం

ఏఎన్‌యూ: సామాజిక సేవకు ఎన్‌ఎస్‌ఎస్ రూపొందించే లక్ష్య సాధనలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల పాత్ర కీలకమని ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శుక్రవారం యూనివర్సిటీ పరిధిలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమీక్షా సమావేశం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతోపాటు సామాజికతను కూడా పెంపొందించాల్సిన బాధ్యత ప్రోగ్రాం ఆఫీసర్లపై ఉందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ సంవత్సర కాలంలో రూపొందించిన కార్యక్రమాలు, పథకాలను పగడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఏఎన్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల అమలుకు సమిష్టిగా కృషి చేద్దామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుధీర్ కుమార్; డాక్టర్ హర్షప్రీతమ్, ఏఎన్‌యూ కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సీహెచ్ రవి కుమార్, ఆచార్య కేవీ నిరుపమ, డాక్టర్ యుగంధర్‌రెడ్డి, డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పుణ్యశేఖర్, డాక్టర్ ఉమాశంకర్ పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగే వెస్ట్ జోన్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ- రిపబ్లిక్ డే పేరేడ్ క్యాంప్–2023లో ఏఎన్‌యూ నుంచి పాల్గొనే మహిళా వలంటీర్ల ఎంపిక కార్యక్రమం శుక్రవారం యూనివర్సిటీలో జరిగింది.

విద్యుదాఘాతంతో పెట్రోలు బంకులో మంటలు



పెట్రోలు బంకులో పగిలిపోయిన ఇటుక బండలు

మార్టూరు: విద్యుదాఘాతంతో పెట్రోలు బంకులో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద జాతీయ రహదారిని ఆనుకొని భారత్ పెట్రోల్ బంకు కార్యాలయంలో శుక్రవారం అక్కడ పనిచేసే సిబ్బంది లైట్లు వేయటానికి స్విచ్ ఆన్ చేయడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దాలతో ఫ్లోరింగ్ రాళ్లు పైన ఉన్న సీలింగ్‌కు తగిలి వెంటనే మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపులోనికి తీసుకొచ్చారు. భూమిలో ఉన్న విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని భావిస్తున్నారు. పెట్రోలు బంకులో పనిచేసే సిబ్బంది అప్రమత్తం అవడంతో ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా వచ్చిన పెద్ద శబ్దంతో పెట్రోల్ కోసం వచ్చిన వాహనదారులు భయంతో పరుగులు తీశారు. పెట్రోలు నిల్వచేసిన ప్రాంతంలో మంటలు వ్యాపించి ఉంటే పెనుప్రమాదం చోటు చేసుకునేదని అక్కడి వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం

కృష్ణా జలాశయంలో చేపపిల్లలు విడుదల

విజయపురిసౌత్: మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి మత్స్యకారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల మండలంలోని అనుపు కృష్ణా జలాశయంలో చేపపిల్లలను విడుదల చేసి మాట్లాడారు. కృష్ణా జలాశయంలో 20లక్షల 89 వేల చేపపిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. మాచర్ల మండల ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక గ్రామ గ్రామానికి అభివృద్ధి జరగటంతోపాటు రాష్ట్రంలో మత్స్యకారుల కుటుంబాల జీవనోపాధి మెరుగుపర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ఎన్నడూ మత్స్యశాఖలో లేని అభివృద్ధి, పథకాలు ప్రభుత్వంలో అమలు జరుగుతున్నాయన్నారు. మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశ వ్యాప్తంగా చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. డీఎఫ్‌వో సంజీవరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపికలు



జిల్లా స్థాయిలో రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులతో ఉపాధ్యాయులు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆవరణలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపికలు శుక్రవారం జరిగాయి. బాల బాలికలకు విడివిడిగా ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 8 పాఠశాలలకు చెందిన సుమారు 150మంది క్రీడాకారులు హాజరయ్యారు.

- అండర్–14 ఫ్రీస్టైల్ 35 కిలోల బాలుర విభాగంలో అచ్చంపేట గురుకుల కళాశాలకు చెందిన పి.నాగచైతన్య, 38 కిలోల విభాగంలో ఎస్.బాబు, 41కిలో విభాగంలో బి.ఓబిడు, 44 కిలోల విభాగంలో సీహెచ్ ఎర్రబాబు, 52కిలోలలో విభాగంలో అడవితక్కెళ్లపాడుకు చెందిన కె.ప్రతాప్, 57కిలోలలో సత్తెనపల్లికి చెందిన కె.విజయరాజు, 68కిలోలలో అచ్చంపేటకు చెందిన సీహెచ్ రాంబాబు, 75కిలోలలో జి.రాజులు ఎంపికయ్యారు.
- అండర్ 17 బాలుర విభాగంలో 45కిలోలు అచ్చంపేట గురుకుల పాఠశాలకు చెందిన వి.పృథ్వీ, 48కిలోలు ఎం శివాజి, 51కిలోలలో బి.సంతోష్, 55కిలోలలో కె.కుమార్‌బాబు, 60కిలోలలో టి.మధు, 65కిలోలలో బి.విజయ్‌బాబు, 71కిలోలలో సత్తెనపల్లికి చెందిన ఎం.ప్రవీణ్, 80కిలోలలో అడవితక్కెళ్లపాడుకు చెందిన టి.పవన్ కళ్యాణ్, 92కిలోలలో ఎస్.భవానీప్రసాద్ ఎంపికయ్యారు. గ్రీకో రోమన్ విభాగంలో అచ్చంపేటకు చెందిన కె.కార్తికేయ, ఎస్.వంశీకుమార్, ఎం.జాయ్, పి.చంటి, బి.మహేంద్ర, బి.కళ్యాణ్, నరసరావుపేటకు చెందిన ఒ.నాగబ్రహ్మయ్య, అడవితక్కెళ్లపాడుకు చెందిన పి.జయకుమార్ తదితరులు ఎంపికయ్యారు.
- అండర్–14 బాలికల విభాగంలో బాపట్లకు చెందిన ఎం.నిస్సీ, కె.శ్రీజ, వి.అనూష, టి.ఐశ్వర్య, జి.అమూల్య, టి.మహి, అమరావతికి చెందిన కె.దీవెన, పూజమల్లేశ్వరి, విజయపురిసౌత్‌కు చెందిన వి.శివన్య, బి.కీర్తి తదితరులు ఎంపికయ్యారు.
- అండర్–17 బాలికల విభాగంలో బాపట్లకు చెందిన సీహెచ్ రోశిలిని, కె.రోజా, డి.ప్రిన్సి, విజయపురిసౌత్‌కు చెందిన ఆర్ గాయత్రిభాయ్, పి.జ్యోతి, ఎం.మెర్సిరోజ్, నరసరావుపేటకు చెందిన ఎం.నాగరత్నకుమారి, అమరావతికి చెందిన ఎం.సుధ తదితరులు ఎంపికయ్యారు.

పోటీలను స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.అరుణ్‌కుమార్ ప్రారంభించారు. వివిధ పాఠశాలలో కోచ్ కె.మనోహర్, ఫిజికల్ డైరెక్టర్స్ కోటేశ్వరి, మెహబూబి, సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. స్థానిక ఫిజికల్ డైరెక్టర్ జి.భూషణం రిఫరీగా వ్యవహరించారు. ఎంపికైన విద్యార్థులంతా ఈనెల 21, 22, 23 తేదీలలో కృష్ణాజిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలలో పాల్గొంటారు.

క్లుప్తంగా

ప్రార్థన మందిరానికి రూ.50వేలు విరాళం



పిట్టలవానిపాలెం: బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె మధుసూదనరెడ్డి ఖాజీపాలెం శివారు గడ్డంవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రార్థన మందిరాన్ని శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ప్రార్థన మందిర నిర్మాణానికి రూ.50 వేల విరాళాన్ని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి సంఘ పెద్దలకు అందజేశారు. నాయకులు గోవతోటి విజయ్, ముప్పిర రాజశేఖర్, అలం గోపీకృష్ణ, మద్దాల డేవిడ్, నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, గిరిజారాణి, డేగల రవిరెడ్డి, కుంచల వీరరాఘవరెడ్డి, దోమ నాగేశ్వరరెడ్డి, మారుబోయిన శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శ్రీఘ్రముగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి పరిశీలన

పిట్టలవానిపాలెం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయానికి కేటాయించిన నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు బొలగాని సుబ్బారావు శుక్రవారం తెలిపారు. పిట్టలవానిపాలెం శివారు గౌడపాలెం, రెడ్లపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి పరిశీలన చేపట్టారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సహకారంతో గ్రామాభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం రూ.20లక్షలతో సీసీ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ పట్టణ కన్వీనర్‌గా బాపూజీ

రేపల్లె రూరల్: పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కన్వీనర్‌గా ఆలూరి బాపూజీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఏటుకూరి విజయ్ తెలిపారు. త్వరలో నియోజకవర్గ, మండల కమిటీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు జూలగంటి బుజ్జిబాబు, దున్నా రాబర్ట్, కోనా శ్రీనివాసరావు, ఆలూరి నారాయణ, నన్నెపాముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టండి

పిట్టలవానిపాలెం: మండలంలోని సంగుపాలెం - పొన్నూరు రహదారి గుంతలమయంగా ఉండి, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, మరమ్మతులు చేపట్టాలని ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్..సదరు కార్పొరేషన్ చైర్మన్ కనుమూని సుబ్బరాజు, కార్యదర్శి పెద్దిన్నకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన విన్నవించారు. చైర్మన్, కార్యదర్శి మరమ్మతులపై సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

భట్టిప్రోలు: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని విజయవాడలో నిర్వహించ తలపెట్టిన.. శంఖారావం దీక్షకు అనుమతులు లేకపోవడంతో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రేపల్లె ఏరియా కన్వీనర్ జి.బాలాజి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులందరికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వేమూరు నియోజకవర్గం కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, ఏఐటీయూసీ కార్యదర్శి దాసరి నాంచారయ్య పాల్గొన్నారు.

శ్రీ సుదర్శన మహా హోమం ప్రారంభం

తెనాలి టౌన్: షరాఫ్ బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారి పవిత్రోత్సవం, సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయంలో ఉదయం అష్టోత్తర శత కళశాభిషేకం, పూర్ణాహుతి జరిపారు. సాయంత్రం అంకురార్పణతో సుదర్శన మహా హోమాన్ని ప్రారంభించారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- వెల్లటూరులో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరించి, అభివాదం చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వెల్లటూరు(భట్టిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. వెల్లటూరులో శుక్రవారం ఉదయం, సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. స్వగ్రామంలో మంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, ఆయన ప్రజల గుండెల్లో సుస్థిరంగా ఉంటారన్నారు. సంక్షేమ పథకాలను పార్టీలతో సంబంధం లేకుండా సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ, జనసేన పార్టీ ఏకమై వైఎస్సార్ సీపీపై నిందలు వేయడం తప్ప వైఎస్ జగన్‌ను ప్రజల నుంచి ఎవరూ వేరుచేయలేరని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని, అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి మంత్రి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ తిరుపీధుల ఉదయ భాస్కరి, సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీటీసీ ధారావత్ కుమారీభాయ్, వైఎస్సార్ సీపీ నాయకులు మోటూరి చౌదరి, చందోలు రవికుమార్, చౌటూరి రవీంద్ర, గురిందపల్లి సునీల్, మోపిదేవి కృష్ణారావు, లుక్కా వెంకన్న, నున్నం ఆనంద్, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరుపీధుల బాలాజి, శివమణి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

- ఆర్థిక భద్రతే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం
- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: పది కాలాల పాటు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటేనే పేదల జీవితాల్లో వెలుగులు ఉంటాయని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చోడాయపాలెం గ్రామంలో ఆయన ఇంటింటికి పర్యటించారు. సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలు అడిగి, తెలుసుకుని ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులే తెలుపుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా పేదవారికి ఆర్థిక భద్రత కల్పించేందుకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు పనికట్టుకుని బురద చల్లే యత్నాలు చేస్తున్నాయని ఎంపీ మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఒక పింఛను పథకం తప్ప మరే ఇతర సంక్షేమ పథకాలు అమలులో లేవని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి చోడాయపాలెం పంచాయతీలో రూ.10.6 కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసిన నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 250 గృహాలు సందర్శించిన ఎంపీ మోపిదేవి..స్థానిక సమస్యలను తెలుసుకుని, సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేశారు. రహదారి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, సచివాలయానికి ఇచ్చే రూ.20లక్షలతో పాటు అదనంగా నిధులు మంజూరు చేయించి, సమస్యలను పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మండలి అంజయ్య, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి భానుకోటి, సర్పంచ్ మాతంగి రవి, ఎంపీటీసీ మేడికొండ సుధాకర చంద్రహాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలి

ఎమ్మెల్యే కోన రఘుపతి



బేతనీకాలనీలో పథకాల అమలును తెలుసుకుని వివరించిన ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల పట్టణం బేతనీకాలనీలో ఆవుట్‌రీచ్ సర్వే కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల వారీగా పథకాల జాబితాను పరిశీలించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి నేరుగా పథకాలు ఏవిధంగా అందిస్తున్నారో తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు.

ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచించారు. 15 నుంచి ప్రారంభమయ్యే సర్వేకు అందరు సహకరించాలని, 30 నుంచి నిర్వహించే మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కొండయ్య, నజీర్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, కాగిత యజ్ఞయ్య, చింతల రాజశేఖర్, జోగి రాజా, ఇనగలూరి మాల్యాద్రి, సోముల రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నేడు పోటుమెరకలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేపల్లె రూరల్: పోటుమెరక గ్రామంలో శనివారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పాల్గొనే ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు వెల్లటూరులో..

భట్టిప్రోలు: వెల్లటూరు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఉదయం, సాయంత్రం జరుగుతుందని సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఇంటింటికి తిరిగి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చుండూరు(వేమూరు): చుండూరు సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా.. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన పింఛన్లు పంపిణీ



లబ్ధిదారులకు నగదు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రత్నప్రసాద్

చెరుకుపల్లి: అర్హులందరికీ నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ అన్నారు. శుక్రవారం గూడవల్లి గ్రామంలో రెండో విడత నూతనంగా మంజూరైన పింఛన్లను 58 మందికి నగదు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గూడవల్లి గ్రామ పంచాయతీలో గతంలో 614మంది లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తుండగా.. కొత్తగా మరో 58మందితో కలిపి మొత్తం 672మందికి పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నలిగిల నాగేశ్వరరావు, ఎంపీటీసీ గౌరిదేవి ఏసుబాబు, తహసీల్దారు కె.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కేవీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలో 535 మందికి నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి తెలిపారు. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని జిలుగువారిపాలెంలో వైఎస్సార్ పింఛను కానుక లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ గృహసారథులు పి. వరప్రసాద్, జి.ఏసుమణి, నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మెరుగైన వైద్యం



కరపత్రం అవిష్కరిస్తున్న ఎంపీపీ వనజ, డీపీవో రాంబాబు

చింతాయపాలెం(కర్లపాలెం): ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీపీవో దాసరి రాంబాబు, ఎంపీపీ యారం వనజ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కరపత్రాలను వారు శుక్రవారం ఆవిష్కరించారు. డీపీవో మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో వారి పేర్లు నమోదు చేయాలని డాక్టర్ సుహానాబేగం దిశానిర్దేశం చేశారు. గ్రామ సర్పంచ్ కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీ రాతంశెట్టి లక్ష్మణరావు, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దారు కేశవ నారాయణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని నివారించాలి



పౌష్టికాహారం తయారీని వివరిస్తున్న సూపర్‌వైజర్లు



పెదపులివర్రు అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీపీ లలిత కుమారి, సూపర్‌వైజర్ మాణిక్యం

కొల్లూరు: పౌష్టికాహార లోపాన్ని నివారించుకోవాలని ఐసీడీఎస్ దోనేపూడి, అనంతవరం సెక్టార్ సూపర్‌వైజర్‌లు నగరాజకుమారి, మాధవి అన్నారు. శుక్రవారం దోనేపూడి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవంలో గర్భిణులకు, బాలింతలకు వారు ఆరోగ్య సూచనలు చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆకు కూరలు, కూరగాయాలు, పాలు, గుడ్లు, పప్పు ధాన్యాల వినియోగం ఎక్కువగా ఉంటే శరీరానికి అవసరమైన పోషకాలు లభ్యమవుతాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, సంధ్య, బసవపూర్ణ పాల్గొన్నారు.

పెదపులివర్రులో పోషకాహార మాసోత్సవం

భట్టిప్రోలు: పెదపులివర్రులో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డి. మాణిక్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకటలలిత కుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో సమకూరే ఆకుకూరలు తోటకూర, గోంగూర, తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ జి.స్వాతి, ఎంఎల్‌హెచ్‌పీ ఆశాజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు బుజ్జమ్మ, మాధవి, రాజ్యలక్ష్మి,, విజయ, సీతమ్మ, దేవి కరుణ, నవమణి, సువర్ణలత, పద్మ పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య సేవలు ఎనలేనివి

రేపల్లె రూరల్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు ఎనలేనివని పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి అన్నారు. భారత రత్న విశ్వేశ్వరయ్య జయంతిని స్థానిక పంచాయతీ రాజ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఇంజినీర్‌గా దేశానికి అనేక సేవలు అందించిన విశ్వేశ్వరయ్య తెలుగు వ్యక్తి కావటం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ హరేరామకృష్ణ, డీఈ ప్రసాద్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

చెరుకుపల్లి: ఆరుంబాక బలుసులపాలెం ఆర్అండ్‌బీ రహదారిలో ఖాదర్ ఖాన్ సెంటరు సమీపంలో పెద్ద పెద్ద గంతలు ఏర్పడ్డాయి. అటువైపుగా పాఠశాలకు వచ్చే విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక జెడ్పీటీసీ మరివాడ పావని తన సొంత ఖర్చుతో రోడ్డు మార్గంలో ఏర్పడిన గుంతలను శుక్రవారం పూడ్చించారు. ఆమె మాట్లాడుతూ చెరుకుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు బలుసులపాలెం, పాదిలివారిపాలెం, ఊచావారిపాలెం, ఆరుంబాక ఎస్సీ కాలని గ్రామాల నుంచి సుమారు వందమంది విద్యార్థులు, ఈ రొడ్డులో రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. గుంతల్లో వర్షపు నీరు చేరితో ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మరివాడ సత్యన్నారాయణ, కొతరపు గణేష్, సిద్దార్థ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బావిలో ఆయిల్ చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

కర్లపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని హెల్త్ సూపర్ వైజర్ జి.ఇసాక్ పేర్కొన్నారు. కర్లపాలెంలో జ్వరాలు విజృంభించడంతో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది దోమల నివారణకు మురుగునీటి కుంటలలో ఎబెట్, మడ్డి ఆయిల్ స్ప్రే చేశారు. పంచాయతీ సిబ్బంది వీధులలో బ్లీచింగ్, సున్నం చల్లారు. సూపర్‌వైజర్ ఇసాక్ మాట్లాడుతూ దోమతెరలు వాడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. గ్రామంలో ఇంటింటికీ సర్వే నిర్వహించి, జ్వరాలున్నవారిని గుర్తిస్తున్నామని తెలిపారు. వారికి వైద్య సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు శేషగిరిరావు, ఆశ కార్యకర్తలు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మత్స్యకార సంఘాల నిర్వహణపై అవగాహన

జంపని(వేమూరు): ఫిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు నియమ నిబంధనలు పాటించాలని, దోనేపూడి గ్రామ మత్స్య సహాయకురాలు కె.రత్న మాధవి అన్నారు. జంపని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. మత్స్యకారులకు సంఘాల విధులపై అవగాహన కల్పించారు. సంఘం రికార్డులు తప్పనిసరిగా ఉండాలని, ఏటా ఆడిట్ చేయించాలని స్పష్టం చేశారు. కూచిపూడి మత్స్య సహాయ శాఖాధికారి దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు ఆటల పోటీలు



ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

నగరం: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఆటల పోటీలు దోహదపడతాయని ఎంఈఓ కొలసాని హరిబాబు అన్నారు. ధూళిపూడి తడవర్తి బాపయ్య స్మారక ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఈఓ మాట్లాడుతూ.. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం అథ్లెటిక్స్ జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మద్ది సత్యనారయణ, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

తెనాలి రూరల్: బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన తెనాలి సుల్తానాబాద్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. సుల్తానాబాద్‌కు చెందిన 50 ఏళ్ల జబర్‌లాల్ నాయక్ బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వైద్యశాలకు తరలించారు. జబర్‌లాల్ నాయక్ ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటికీ సమరసత సేవ ఫౌండేషన్ ప్రచారం



కరపత్రాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తెనాలి టౌన్: సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో జరుగుతున్న ఇంటింటికీ ధర్మప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం యడ్ల లింగయ్య కాలనీ, ఇందిరానగర్‌లలో నిర్వహించారు. సభ్యులు ఇంటింటికీ వెళ్లి హిందూ ధర్మం గొప్పదనాన్ని తెలియజేస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమ శంకరరావు మాట్లాడుతూ హిందూ ధర్మం మానవులందరి సంక్షేమం కోరుకుటుందని తెలిపారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ఆయన కార్యాలయంలో కలసి కరపత్రాల్ని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తెనాలి సబ్‌డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్‌కుమార్, ధర్మప్రచారక్ చంద్రసాయి, మహిళా కన్వీనర్లు కోనేటి అన్నపూర్ణ, కె.మాధురి, డి.దుర్గ, బాలాత్రిపుర సుందరి, నర్రా పద్మ పాల్గొన్నారు.

రేపు కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం



తెనాలి: కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ, తెనాలి 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.2.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు వెల్లడించారు. సొసైటీ షేర్ కాపిటల్ 1.96 కోట్లు, డిపాజిట్లు రూ.102.24 కోట్లు ఉండగా బంగారు ఆభరణాలు, స్థిరాస్తులపై రూ.97.87 కోట్ల రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. స్థానిక కొత్తపేటలోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దావులూరి సోమశేఖరరావుతో 2001లో రెండు శాఖలతో ఆరంభమైన సొసైటీ, ఇప్పుడు తన హయాంలో తొమ్మిది శాఖలు నడుస్తున్నాయని తెలిపారు. తెనాలితోపాటు, కొల్లూరు, కొల్లిపర, గుంటూరు శాఖలు సొంత భవనాల్లో ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం పట్టణంలోని సొంత భవనంపై రెండో అంతస్తు నిర్మాణం జరుగుతోందని చెప్పారు. బంగారు ఆభరణాలపై 11.5 శాతం, స్థిరాస్తులపై 15 శాతం వడ్డీకి రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. సొసైటీ 23వ వార్షిక సర్వసభ్య సమావేశం ఈనెల 17న తెనాలి ఎన్జీవో కల్యాణమండపంలో జరుగుతుందని, సభ్యులంతా హాజరుకావాలని కోరారు. సమావేశం అనంతరం శ్రీవెంకటలక్ష్మి దుర్గ నాట్యమండలి, తెనాలి వారి 'దేవ నర్తకి' పద్య నాటకం ఉంటుందని వివరించారు.